

యంత్రం.. నాటు మంత్రం

వ్యవసాయంలో ఎప్పటికప్పుడు అధునాతన యంత్రాలు అందుబాటులోకి రావడంతో రైతులకు ఎంతో మేలు కలుగుతుంది.




రిజిస్ట్రేషన్ శాఖలో సర్వర్ డౌన్

భూమి విలువలను శనివారం నుంచి పెంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో క్రయవిక్రయదారులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద బారులు తీరారు.

8 లో

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 8,779 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,593, మధ్య డెల్టాకు 1,686, పశ్చిమ డెల్టాకు 4,500 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 7.95 అడుగులకు తగ్గింది.

న్యూస్‌రీల్

మహా సౌరయాగం ఆరంభం



కలశ స్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ తోట కుటుంబీకులు

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి గ్రామంలో ఉన్న రామ మందిరంలో మాఘ మాసాన్ని పురస్కరించుకుని నెలరోజుల పాటు జరిగే నవగ్రహ నక్షత్ర పూర్వక మహా సౌరయాగం పూజలు గురువారం మొదలయ్యాయి. అష్టమ వార్షికోత్సవం సందర్భంగా నెలరోజుల పాటు ఆలయ ప్రధాన అర్చకులు మున్నంగి రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో గ్రామంలో వేదఘోష మార్మోగనుంది. ఈ పూజలను గురువారం ఆలయ అర్చకులు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కుటుంబీకులతో ప్రారంభించారు. ఈ పూజల్లో భాగంగా ప్రతీ రోజు జన్మనక్షత్రాల రీత్యా ఒక్కోరోజు ఒక్కో మెక్కను పూజించి, సౌర యాగం, సౌర కల్యాణం, విశేష పూజలు చేయించి, చండీయాగం, నక్షత్ర జపాలు, నక్షత్ర హోమాలు, మొదటి తొమ్మిది రోజులు రాజశ్యామల యాగం నిర్వహిస్తున్నామని నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. వైఎస్సార్ సీపీ యువ నాయకుడు తోట పృథ్వీ రాజు, తోట రాము, సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, సలాది స్వామినాయుడు, కోలా ఏసు, పుత్సల ఏసు పాల్గొన్నారు.

గాంధీజీకి నివాళి



కలెక్టరేట్‌లో మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఏవో కాశీ విశ్వేశ్వరరావు, రెవెన్యూ ఉద్యోగులు

అమలాపురం రూరల్: అహింసా, సత్యాగ్రహాలే ఆయుధాలుగా దేశానికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అందించిన మహనీయుడు జాతిపిత మహాత్మాగాంధీ అని కలెక్టరేట్ పరిపాలనాధికారి కె.కాశీ విశ్వేశ్వరరావు అన్నారు. గురువారం జాతి పిత మహాత్మాగాంధీ 77వ వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణంలో గాంధీ కాంస్య విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి రెవెన్యూ ఉద్యోగులతో కలిసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ గాంధీ సహాయ నిరాకరణ, విదేశీ వస్తు బహిష్కరణ, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాలు నిర్వహించి ఎన్నోమార్లు జైలుకు వెళ్లారన్నారు. వికాస జిల్లా మేనేజర్ జి. రమేష్ మాట్లాడుతూ గాంధీజీ సత్యం, అహింస, శాంతి ఉత్తమ మార్గాలని దృఢంగా నమ్మి ఆచరించిన మహనీయుడని అన్నారు. మెజిస్ట్రీరియల్ సెక్షన్ సూపరింటెండెంట్ రమణకుమారి, భూసేకరణ సెక్షన్ అధికారి ఏసుబాబు, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు టెన్త్ విద్యార్థులకు 'ప్రేరణ'

రాయవరం: పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులకు శుక్రవారం 'ప్రేరణ' కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా గురువారం మండల విద్యాశాఖ అధికారులకు తెలియజేశారు. ముమ్మిడివరం సమీపంలోని చెయ్యేరు శ్రీనివాస ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఈ ప్రేరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులను రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిపే విధంగా ప్రోత్సహించేందుకు 'ప్రేరణ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 100 శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా శిక్షణ ఇవ్వడం, పరీక్షల్లో శతశాతం మార్కులు సాధించే విధంగా మోటివేషన్ తరగతులు నిర్వహించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశంగా తెలిపారు. ప్రేరణ కార్యక్రమంలో భాగంగా సమ్మేటివ్-1 పరీక్షల్లో 520 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 300 మందికి పైగా విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహిస్తున్నారు.

1, 3న ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు పరీక్షలు

కంబాలచెరువు: ఇంటర్మీడియెట్ పరీక్షల్లో భాగంగా ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఫిబ్రవరి 1న నైతికత, మానవీయ విలువలు, 3న పర్యావరణ విద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఇంటర్ బోర్డు ఆర్ఐవో ఎస్ఎస్వీఎల్ నరసింహం గురువారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఈ పరీక్షలకు జనరల్ విభాగంలో 20,591 మంది, వృత్తివిద్యా కోర్సుల్లో 2,226 మంది హాజరవుతారన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పరీక్షలు జరుగుతాయన్నారు.



వధూవరుల మంగళ స్నానానికి ఏర్పాటు చేసిన సెట్టింగ్

- మాఘమాసం రావడంతో శుభ ముహూర్తాలకు వేళ
- నేటి నుంచి పెళ్లి సందడి
- కల్యాణ మండపాలకు, ఈవెంట్ నిర్వాహకులకు, కళాకారులకు డిమాండ్

వివాహానికి అలంకరించిన కల్యాణ మండపం

నూరేళ్ల పంటకు ఏరువాక!

కొత్తపేట/బిక్కవోలు: మాఘమాసం ప్రారంభమైంది. వివాహాల సందడి ప్రారంభం కానుంది. శుక్రవారం నుంచి ముహూర్తాలు మొదలయ్యాయి. పరిణయ ముహూర్తాలను వెంటబెట్టుకొచ్చిన ఈ మాసం నుంచి పెళ్లిళ్లే కాకుండా నిశ్చితార్థాలు, గృహ ప్రవేశాలు, నామకరణోత్సవాలు, అన్నప్రాసనలు, అక్షరాభ్యాసాలు... తదితర శుభకార్యాలతో ఇంటింటా బాజా భజంత్రీలు, మంగళ వాయిద్యాలు మోగనున్నాయి. కల్యాణ వేదికలు ముస్తాబయ్యాయి. ఈ నెల 31వ తేదీ తొలి ముహూర్తాన అనేక జంటలు ఒక్కటి కానున్నాయి.

కల్యాణ మండపాలకు డిమాండ్

రెండుమూడు నెలలుగా సంబంధాలు కుదిరిన జంటలకు తల్లిదండ్రులు మాఘమాసంలో వివాహాలను జరిపిస్తున్నారు. అందువల్ల అనేక మంది ముందుగానే కల్యాణ మండపాలను బుక్ చేసుకోవడంతో వాటికి డిమాండ్ నెలకొంది. కల్యాణ మంటపాలు దొరకనివారు తమ ఇళ్ల వద్ద, విశాలమైన ఖాళీ స్థలాల్లో వివాహాలను జరుపుకొనేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వివాహాలు, శుభకార్యాల సీజన్ ప్రారంభం కానుండటంతో వివిధ వ్యాపారాలు ఊపందుకున్నాయి. ప్రధానంగా దుస్తులు, బంగారం, అలంకరణ వస్తువులు, శుభకార్యాలకు అవసరమయ్యే సామగ్రి, పూల వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి.

స్టేటస్ కోసం.. తగ్గేదేలే

ప్రస్తుతం ధనవంతులు తమ పిల్లలకు జరిపే వివాహాలు వారి స్టేటస్‌కు సింబల్‌గా మారాయి. ఆర్థిక పరిపుష్టిగల వారు వివాహాల కోసం ఖర్చుకు ఏమాత్రం వెనకాడకుండా ప్రతిదీ గ్రాండ్ గా ఉండేలా చూసుకుంటున్నారు. వివాహ సమయంలో డెకరేషన్, విందు కోసం రూ.లక్షలు ఖర్చు చేస్తున్నారు. అత్యాధునిక కెమెరాలతో ఫొటోలు, వీడియోలు తీయించేందుకు కూడా రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నవారు.

అనేకమందికి ఉపాధి

వివాహాలు, శుభకార్యాలు ప్రారంభం కావడంతో ప్రధానంగా పురోహితులకు, డెకరేషన్, మంగళ, బ్యాండు వాయిద్య కళాకారులకు, ఫొటో, వీడియో గ్రాఫర్స్, కల్చరల్ ఈవెంట్ ఆర్గనైజర్స్ (ఆర్కెస్ట్రా), క్యాటరింగ్, బ్యూటీపార్లర్ నిర్వాహకులకు, ట్రావెల్స్ ఏజెన్సీలకు డిమాండ్ ఏర్పడింది. అందువల్ల ఆయా వ్యాపార వర్గాల వారికి చేతినిండా పని లభించడంతో శుభకార్యాలు వారి ఉపాధికి దోహదపడుతున్నాయి.

డ్రోన్ ఫొటోగ్రఫీకి గిరాకీ

ఫొటోగ్రఫీ, వీడియోలకు గిరాకీ పెరిగింది. గగనతలం నుంచి అత్యంత క్వాలిటీతో ఫొటోలు, వీడియోలు తీయడం డ్రోన్ ఫొటోగ్రఫీ విశిష్టత. దీంతో దీనికి ఆదరణ పెరిగింది. డ్రోన్‌తో ఫొటోలు, వీడియోలు తీసేందుకు వ్యాపారులు ఒక్కో కార్యక్రమానికి రూ.10వేల నుంచి రూ.20వేల వరకు తీసుకుంటున్నారు. దీనికి ప్రింటింగ్ ఖర్చులు అదనం.

బ్యాండు మేళాలకు డిమాండ్

వధూవరులను సిద్ధం చేయడం దగ్గర నుంచి పెళ్లయి మళ్లీ వారిని ఇంటికి తీసుకొచ్చేవరకూ మంగళ వాయిద్యాల అవసరం ఉంటుంది. బ్యాండ్ మేళం వారు ఒక్కో కార్యక్రమానికి రూ.పదివేలకు పైగా తీసుకుంటున్నారు. కొందరు పెళ్లిలో సంగీత విభావరులు నిర్వహిస్తున్నారు. దీనికి రూ.50 వేల నుంచి రూ.3లక్షల వరకూ తీసుకుంటున్నారు.

విందుకు ప్రత్యేక స్థానం

విందు లేనిదే పెళ్లి ఉండదు. దీనికి చాలామంది అధిక ప్రాధాన్యం ఇస్తారు. భోజనాలు రుచిగా..శుచిగా ఉండాలని బంధుమిత్రుల్లో మాట రాకూడదని భావిస్తారు. అందుకే ఎంత ఖర్చయినా వెనుకాడరు. ఇప్పుడు ఉదయం టిఫిన్ దగ్గర నుంచి రాత్రి భోజనం వరకూ ఇలా పెళ్లి అయిపోయేవరకూ సరఫరా చేసే క్యాటరింగ్ సంస్థలు చాలానే ఉన్నాయి. మెనూ ప్రకారం ధరలు వసూలు చేస్తారు. ఎంచుకున్న పదార్థాలను బట్టి ప్లేట్ ధర రూ.120 నుంచి రూ.350 వరకు ఉంటుంది.

పసిడి, పూల ధరలు పైపైకి..

మార్కెట్‌లో బంగారం ధర రోజురోజుకూ పెరుగుతోంది. పెళ్లిళ్ల ముహూర్తాలు ఎక్కువగా ఉండడంతో వివిధ వస్తువుల, పూల ధరలు బాగా పెరుగుతున్నాయి.

ఈ మాసంలో పండగలూ అధికమే

మాఘమాసంలో పండగలు కూడా అధికంగానే ఉంటాయి. ఫిబ్రవరి నెల 3న వసంత పంచమి, 4న రథసప్తమి, 8 న భీష్మఏకాదశి, అంతర్వేది తీర్థం, లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణోత్సవం, 26న మహా శివరాత్రి వంటి పర్వదినాలు ఉన్నాయి.

అత్యంత పవిత్ర మాసం



మాఘమాసంలో ఎన్నో పర్వదినాలు వరుసగా వస్తాయి. జనవరి 31, ఫిబ్రవరి 3, 6,7, 15, 16, 21, 22, 23 తేదీలతో పాటు మార్చిలో 8 రోజులు, ఏప్రిల్‌లో 12 రోజులు, మే నెలలో 10 రోజులు వివాహాలు, గృహ ప్రవేశాలు, శంకుస్థాపన ముహూర్తాలున్నాయి.

– పిదపర్తి రవికుమార్, వేద పండితుడు, పలివెల, కొత్తపేట మండలం

కొత్త వంటకాలపై దృష్టి



పెళ్లిళ్ల సీజన్ వస్తే చాలు రకరకాల వంటకాలతో భోజన ప్రియులను మెప్పించాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా సరికొత్త వంటకాలను రుచి చూపించాలి. అందుకు అనుగుణంగా మేం సమాయత్తమవుతున్నాం.

– గొద్దు సూర్యనారాయణ, వంటమాస్టర్, ఆరికరేవుల

అవకాశాలు బాగున్నాయి



గతంలో ఏ చిన్న ఫొటో తీయాలన్నా ఫొటోగ్రాఫర్ అవసరం ఉండేది. ఇప్పుడు స్మార్ట్‌ఫోన్ వల్ల ఫొటోగ్రాఫర్ పని తగ్గింది. మారుతున్న కాలానికి అనుగుణంగా డ్రోన్, డిజిటల్, ఫొటోషూట్‌కు అవకాశాలు బాగా ఉన్నాయి.

– జి.భద్రరావు, వీడియో, ఫొటోగ్రాఫర్, పందలపాక

ఈవీఎంలకు పటిష్ట భద్రత కల్పించాలి

రాష్ట్ర నోడల్ అధికారి తాతబ్బాయి

ముమ్మిడివరం: ఎలక్ట్రానిక్ యంత్రాలు, వీవీ ప్యాడ్ గోదాములకు పటిష్ట భద్రత కల్పించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఉప అదనపు ముఖ్య కార్య నిర్వహక అధికారి, ఈవీఎం రాష్ట్ర నోడల్ అధికారి తాతబ్బాయి ఆదేశించారు. ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈవీఎం, వీవీప్యాట్స్ భద్ర పర్చిన గోదాములను జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ ఎస్.రాజకుమారి, వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, వీవీప్యాట్ల పటిష్టతకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లపై రెవెన్యూ, ఎన్నికల, అగ్నిమాపక అధికారులతో సమీక్షించారు. నోడల్ అధికారి తాతబ్బాయి మాట్లాడుతూ ఈవీఎంలు, వీవీప్యాట్లు భద్రపర్చిన గోదాములను ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెలా తనిఖీ నిర్వహించి నివేదికను ఎన్నికల సంఘానికి నివేదించాలన్నారు. ప్రతి నెలా అధికారులతోను, ప్రతి మూడునెలలకోసారి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాముల తనిఖీలు నిర్వహిస్తామన్నారు. తహసీల్దార్ సుబ్బలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ శివరాజ్ రామ్మోహనరావు, రెవెన్యూ, అగ్నిమాపక అధికారులు పాల్గొన్నారు.



గోదాములను తనిఖీ చేస్తున్న ఈవీఎంల నోడల్ అధికారి తాతబ్బాయి, జిల్లా రెవెన్యూ అధికారి రాజకుమారి

భక్తుల రద్దీకి అనుగుణంగా సౌకర్యాలు

అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలపై కలెక్టర్ సమీక్ష

సఖినేటిపల్లి: అంతర్వేది క్షేత్రంలో వచ్చే నెల 4వ తేదీ నుంచి 13వ తేదీ వరకూ పది రోజుల పాటు జరిగే లక్ష్మీనరసింహస్వామివారి వార్షిక దివ్య తిరు కల్యాణ మహోత్సవాల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా సౌకర్యాలు చేపట్టాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఏరోజుకారోజుతో పాటు ప్రధానమైన రోజులలో కూడా ముందస్తుగా భక్తుల రద్దీని అంచనా వేసుకోవాలని సూచించారు. గురువారం అంతర్వేది ఆలయ ప్రాంగణంలో స్వామి కల్యాణ మహోత్సవాల ఏర్పాట్లు పురోగతిపై కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఆలయం వెలుపల, లోపల భక్తుల క్యూ లు, తాగునీటి వసతి, భక్తుల భద్రతకు సీసీ కెమెరాలు గురించి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, కలెక్టర్‌కు వివరించారు. తీర్థంలో శానిటేషన్, పార్కింగ్ స్థలాల ఏర్పాటు గురించి పురోగతిని డీపీవో వివరించారు. గుర్రాలక్క గుడి వద్ద, ఇతర చోట్ల ఎనిమిది పార్కింగ్ స్థలాలు ఎంపిక చేశామన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆయా మార్గాలు, ప్రసాదం కౌంటర్లు, పార్కింగ్ స్థలాల గురించి సూచించే సైనింగ్ బోర్డులు ఏర్పాటు చేయాలని పంచాయతీరాజ్ అధికారులకు సూచించారు. కల్యాణ వేదిక వద్ద సాధారణ భక్తులు, వీఐపీ గ్యాలరీల గురించి పర్యవేక్షణ అధికారి అమలాపురం ఆర్డీవో కె.మాధవి, పౌర్ణమి రోజున స్నానఘట్టాల వద్ద భద్రతా ఏర్పాట్లు, బీచ్‌లో జల్లు స్నానం గురించి పర్యవేక్షణ అధికారి, రామచంద్రపురం ఆర్డీవో అఖిల కలెక్టర్‌కు వివరించారు. రథయాత్ర సాగే మార్గంలో భక్తుల రద్దీకి తగ్గట్టుగా తీసుకుంటున్న చర్యలను డ్వామా పీడీ మధుసూదన్ వివరించారు. తీర్థంలో ప్రాథమిక వైద్య శిబిరాలతోపాటు, అత్యవసర సేవలకు ఏర్పాట్లు చేస్తున్నట్టు డీఎంహెచ్‌ఓ దుర్గారావు దొర తెలిపారు. భక్తులకు 120 తాత్కాలిక మొబైల్ టాయిలెట్స్, 20 డ్రింకింగ్ వాటర్ స్టాల్స్, సత్రాలకు 15 ట్యాంకర్స్ ద్వారా నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అమలాపురం డీఎస్పీ ప్రసాద్ మాట్లాడుతూ, భక్తులకు లడ్డు ప్రసాదం కౌంటర్ కొపనాతి కృష్ణమ్మ విగ్రహం ఏరియాలో ఏర్పాటుకు, తీర్థంలో అన్నిచోట్లా డ్రోన్స్ తిరగనున్న నేపథ్యంలో బీచ్‌లో దుస్తులు మార్చుకునే గదులు పైన కూడా మూసివేసేటట్టు చూడాలని కలెక్టర్‌కు కోరారు. కాగా భక్తుల భద్రతకు మెరైన్, పోలీసు, ఎండోమెంట్స్ శాఖలు సంయుక్తంగా నిర్వహించే కమాండ్ కంట్రోల్ రూంకు ఆయా ఏరియాలలోని మొత్తం సీసీ కెమెరాలు కనెక్ట్ అయ్యేలా చూసుకోవాలని, బీచ్‌లో కూడా మొదటిసారిగా ఏర్పాటు చేయబోయే ఈ వ్యవస్థ కూడా అనుసంధానం కావాలని కలెక్టర్, ఆయా అధికారులకు ప్రత్యేక సూచనలు చేశారు. ఎండోమెంట్స్ డీసీ డీఎల్‌వీ రమేష్‌బాబు, తహసీల్దారు ఎం.వెంకటేశ్వరరావు, డీటీ భాస్కర్, ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ బాలాజీ, ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ కొండా జాన్‌బాబు, ఎంపీటీసీ సభ్యుడు బైరా నాగరాజు పాల్గొన్నారు. అంతకుముందు కలెక్టర్ లక్ష్మీనృసింహ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కలెక్టర్‌కు అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు.



అంతర్వేదిలో స్వామివారి కల్యాణ మహోత్సవాల పురోగతిని సమీక్షిస్తున్న కలెక్టర్

రత్నగిరిపై సిరుల వాన

- సత్యదేవునికి రికార్డు స్థాయి రాబడి
- హుండీల ద్వారా 30 రోజులకు రూ.1.33 కోట్ల ఆదాయం

అన్నవరం: భక్తవరదుడైన సత్యదేవుడు వెలసిన రత్నగిరిపై సిరుల వాన కురిసింది. అన్ సీజన్ అయినప్పటికీ దండిగా రాబడి వచ్చింది. గడచిన 30 రోజులకు రికార్డు స్థాయిలో రూ.1,33,16,044 ఆదాయం సమకూరింది. దేవస్థానంలోని హుండీలను గురువారం తెరచి, భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. నగదు రూ.1,27,31,994, చిల్లర నాణేలు రూ.5,84,050 వచ్చాయని దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు తెలిపారు. వీటితో పాటు బంగారం 62.200 గ్రాములు, వెండి 525.700 గ్రాముల చొప్పున లభించాయి.

దండిగా విదేశీ కరెన్సీ

హుండీల ద్వారా సత్యదేవునికి పెద్ద మొత్తంలో విదేశీ కరెన్సీ కూడా లభించింది. అమెరికన్ డాలర్లు 369, సింగపూర్ డాలర్లు 50, యుఏఈ దీరామ్స్ 30, ఆస్ట్రేలియన్ డాలర్లు 100, సౌదీ అరేబియా రియల్స్ 5, జపాన్ నిప్పోన్ జింకాలు 1,000, ఇండోనేషియా రూపాయలు రూ.1.20 లక్షలు, మలేషియా రింగిట్స్ 5, ఇంగ్లండ్ పౌండ్లు 65, కువైట్ దీనార్లు 10 చొప్పున భక్తులు హుండీల్లో వేశారు.

అన్ సీజన్‌లోనూ అధిక ఆదాయం

సాధారణంగా రత్నగిరిపై కార్తికం అనంతరం మార్గశిరం, పుష్య మాసాలను అన్ సీజన్‌గా భావిస్తారు. ఈ మాసాల్లో పెద్దగా వివాహాలు జరుగవు. భక్తులు కూడా అంతగా రారు. ఎక్కువగా ఉత్తరాది రాష్ట్రాల భక్తులు మాత్రమే వస్తుంటారు. అయినప్పటికీ ఈసారి హుండీ ఆదాయం అధికంగానే రావడం గమనార్హం. కార్తిక మాసం అనంతరం గత డిసెంబర్ 30వ తేదీన హుండీల ఆదాయం లెక్కించారు. తరువాత మళ్లీ ఇప్పుడు లెక్కించారు. ఈ 30 రోజులు పూర్తిగా పుష్య మాసం కావడం గమనార్హం. అయితే సంక్రాంతి సెలవుల్లో సత్యదేవుని సన్నిధికి భారీ సంఖ్యలో భక్తులు వచ్చారు. సాధారణ రోజుల్లో సైతం రోజుకు కనీసం 20 వేలకు తగ్గకుండా భక్తులు వచ్చారు. దీంతో అధిక మొత్తంలో ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. హుండీల ద్వారా గడచిన 30 రోజుల్లో సగటున రోజుకు రూ.4,43,868 చొప్పున ఆదాయం లభించిందని వివరించారు. హుండీల ఆదాయం లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం, పలు స్వచ్ఛంద సంస్థల సిబ్బంది కూడా పాల్గొన్నారు. హుండీల్లో వచ్చిన నగదును స్థానిక యూనియన్ బ్యాంకుకు తరలించి భద్రపరిచారు.



హుండీ నగదును కట్టలు కడుతున్న సిబ్బంది

జాతీయ క్రికెట్ పోటీలకు సాహితిశ్రీ

దేవరపల్లి: హర్యానాలోని పంచకులలో వచ్చే నెల 3 నుంచి 8వ తేదీ వరకూ జరగనున్న జాతీయ అండర్-17 బాలికల ఎస్‌జీఎఫ్ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు దేవరపల్లి జెడ్పీ హైస్కూలు విద్యార్థిని ఓరుగంటి సాహితీశ్రీ ఎంపికైంది. ఈ జట్టు గురువారం పంచకులకు బయలుదేరిందని స్థానిక అంబటి సత్యనారాయణరావు జెడ్పీ హైస్కూలు వ్యాయామోపాధ్యాయుడు ఓరుగంటి నాగరాజు తెలిపారు. ఈ జట్టుకు ఈ నెల 27 నుంచి 30 వరకూ గుంటూరులోని శుభం క్రికెట్ అకాడమీలో శిక్షణ ఇచ్చారు. క్రీడాకారులకు గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి మల్లెంపు రవి, టీం కోచ్ డి.భూపాల్‌రెడ్డి, మేనేజర్ శివప్రియ, క్రికెట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కరీముల్లా చౌదరి, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ డి.భాస్కరరావు శుభాకాంక్షలు తెలిపారు.

2న సీనియర్ వుమెన్ హాకీ ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): వచ్చే నెల 2న సీనియర్స్ వుమెన్ విభాగం హాకీ క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు జిల్లా హాకీ సంఘం కార్యదర్శి నంబు శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 8 నుంచి 10వ తేదీ వరకూ నెల్లూరులో జరిగే అంతర్ జిల్లాల వుమెన్ హాకీ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కాకినాడలోని జిల్లా క్రీడా మైదానం హాకీ కోర్టులో ఈ ఎంపికలు ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతాయని, ఆసక్తి ఉన్న వారు హాజరు కావాలని హాకీ కోచ్ వి.రవిరాజు కోరారు.

మోసపోయామని ప్రజలు గుర్తించారు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి

- మాజీ మంత్రి గొల్లపల్లి
- కొడుకు లోకేశ్ ప్రమోషన్ కోసమే దావోస్ పర్యటన అని విమర్శ

మలికిపురం: చంద్రబాబు వాగ్దానాలు నమ్మి మోసపోయామని ప్రజలు గుర్తించారని మాజీ మంత్రి, రాజోలు వైఎస్సార్ సీపీ కోఆర్డినేటరు గొల్లపల్లి సూర్యారావు పేర్కొన్నారు. గురువారం మలికిపురంలో వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలలో ఏ ఒక్కటీ అమలు చేయని చంద్రబాబు ప్రజలను నమ్మించి మోసం చేయడంలో దిట్ట అని ఎద్దేవా చేశారు. మహిళలకు ఉచిత బస్ లేదని, గ్యాస్ సబ్సిడీ లేదని, నిరుద్యోగ భృతి ఏమైందని ఆయన ప్రశ్నించారు. పెట్టుబడుల కోసం దావోస్ వెళ్లి ఏం ఉద్ధరించారో ప్రజలకు చెప్పాలన్నారు. పక్క రాష్ట్రం తెలంగాణ రూ.1.60 లక్షల కోట్ల పెట్టుబడులు తెస్తే ఆంధ్రాకు కనీసం దారి ఖర్చులకు సరిపడా పెట్టుబడులు కూడా తేలేదని ఆయన పేర్కొన్నారు. కేవలం కొడుకు లోకేశ్ ప్రమోషన్ కోసమే చంద్రబాబు దావోస్ వెళ్లారని పేర్కొన్నారు. ఈ రోజు కూటమి పాలన చూసి ప్రజలు భయాందోళన చెందుతున్నారని ఆయన అన్నారు. నాయకులు పాటి శివ కుమార్, కుసుమ చంద్రశేఖర్, కూనపరెడ్డి రాంబాబు, కట్టా శ్రీనివాసరావు, బొలిశెట్టి భగవాన్, నల్లి ప్రేమానందం, మోకా సురేష్, ఈద రవిరెడ్డి, అడబాల జానకీరామ్, తాడి సహదేవ్, కారుపర్తి భాస్కరరావు పాల్గొన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	20,000
గటగట (వెయ్యి)	17,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	14,500 – 15,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	15,000 – 15,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్లుప్తంగా

కృపాకిరణ్ మృతదేహం లభ్యం



కృపాకిరణ్ మృతదేహం

అల్లవరం: మలికిపురం మండలం రామరాజులంక ప్రాంతానికి చెందిన కృపాకిరణ్ మంగళవారం మధ్యాహ్నం బోడసకుర్రు బ్రిడ్జిపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన విషయం విదితమే. రెండు రోజులుగా మృతదేహం కోసం గాలిస్తుండగా పాశర్లపూడి నదీ తీరంలో గురువారం గుర్తించారు. కిరణ్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. శవపంచనామా, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై హరీష్‌కుమార్ తెలిపారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో జయంతి సత్తా

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం) : కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎస్.జయంతి హ్యాండ్‌బాల్ పోటీల్లో సత్తా చాటి సౌత్ జోన్ పోటీలకు ఎంపికైందని కళాశాల ప్రిన్సిపాల్ రాఘవ కుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవలే నన్నయ విశ్వవిద్యాలయం అంతర కళాశాలల ఎంపికల పోటీల్లో ప్రతిభ చూపిన జయంతి సాలెంలో జరగనున్న సౌత్ జోన్ పోటీల్లో తలపడనున్నదని చెప్పారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కేవీస్ రత్నకుమార్ , కళాశాల పీడీ వైసు ధారాణి విద్యార్థిని అభినందించారు.

యంత్రం.. నాటు మంత్రం

- వరినాటు యంత్రంతో రైతుకు మేలు
- పెట్టుబడి తక్కువ, దిగుబడి ఎక్కువ
- కూలీల కొరతను అధిగమించే అవకాశం
- విత్తనాలు, సమయం ఆదా



అలమూరులో వరి నాటు యంత్రంతో నాట్లు వేసేందుకు రైతుకు శిక్షణ ఇస్తున్న వ్యవసాయాధికారి (ఫైల్)

అలమూరు: వ్యవసాయంలో ఎప్పటికప్పుడు అధునాతన యంత్రాలు అందుబాటులోకి రావడం రైతులకు ఎంతో మేలు కలుగుతుంది, దీనివల్ల రోజురోజుకూ పెరుగుతున్న కూలీల కొరతను ఎదుర్కోవడంతో పాటు, పెట్టుబడిని ఆదా చేసుకుని, నాణ్యమైన దిగుబడులు సాధించే అవకాశం ఉంది. సమయాన్ని, శ్రమను ఆదా చేసుకుని, ఏ విధమైన ఒత్తిడి లేకుండా వరి సాగు చేసుకోవచ్చు. వరి సాగులో ఎన్ని అధునాతన యంత్రాలు అందుబాటులోకి వచ్చినా, ఆధునిక పద్ధతులు అవలంబిస్తున్నప్పటికీ.. వరి నాటు యంత్రాలకు మాత్రం ప్రత్యేక స్థానం ఉంటుందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వ్యవసాయాధికారి, వ్యవసాయ శాఖ అలమూరు సబ్ డివిజన్ సహాయ సంచాలకుడు కె.నాగేశ్వరరావు తెలిపారు. వరి నాటు యంత్రం పనితీరు, ఉపయోగాలు ఆయన మాటల్లోనే తెలుసుకుందాం.

ప్రస్తుతం వరిసాగులో డ్రమ్ సీడర్, శ్రీవరి సాగు అందుబాటులో ఉన్నప్పటికీ, వరి నాటు యంత్రం (ఎస్ఎంఎస్ఆర్ఐ) ద్వారా చేపట్టే సాగు వల్ల రైతుకు అనేక ఉపయోగాలతో పాటు, సమయం, ఖర్చు ఆదా అవుతుంది. ఎకరం పొలంలో కేవలం 12 నుంచి 15 కేజీల విత్తనం మాత్రమే అవసరమవుతుంది. ఈ విధానం ద్వారా వరి నారును ట్రేల్లో పెంచి, నేరుగా యంత్రం సాయంతో పొలంలో నాట్లు వేస్తారు. వరి నాటు యంత్రాలను గత ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా రాయితీపై రైతులకు అందించింది. ఈ వరి నాటు యంత్రాలు నాలుగు, ఆరు, ఎనిమిది వరుసల్లో మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. ఈ యంత్రాల సామర్థ్యాన్ని బట్టి ఎకరా పొలంలో నాటేందుకు గంట నుంచి రెండు గంటల సమయం పడుతుంది.

పాడి-పంట

యంత్రం ద్వారా సాగు యాజమాన్య పద్ధతులు

- ఒక ఎకరాకు అవసరమయ్యే 12 నుంచి 15 కేజీల విత్తనాలను విత్తన శుద్ధి చేసిన తర్వాత 24 గంటల పాటు నానబెట్టాలి.
- సీడింగ్ మెషీన్ సాయంతో ఏడు మి.మీ. మందం ఉన్న జల్లెడతో జల్లించిన మట్టిని ట్రేల్లో నింపాలి.
- విత్తనాలను ట్రేలోని మట్టిలో చల్లిన తర్వాత పైన వర్మీ కంపోస్టును పలుచగా చల్లాలి.
- ప్రతి రోజూ క్యాన్లతో జాగ్రత్తగా నీటి తడులు ఇవ్వడం ద్వారా త్వరితగతిన మొలక వస్తుంది.
- ఈ విధానంలో ఎకరా పొలంలో వరి నాట్లు వేసేందుకు 80 క్యాన్ల నీరు అవసరమవుతుంది.
- 15 రోజుల్లో నాటేందుకు నారు సిద్ధమవుతుంది. ఈ నారు ట్రేలను మెషీన్‌లో అమర్చాలి.

దమ్ము చేయాల్సిన విధానం

- పొలంలో ఐదు సెం.మీ. వరకు నీరు నిల్వ ఉండేలా చూసుకోవాలి.
- ట్రాక్టర్ రోడా రీడర్ సాయంతో దమ్ము చేయాలి. రోడా రీడర్ దుక్కుకు ముందు వేసవి దుక్కు అవసరం లేదు.
- దుక్కి పూర్తయ్యాక బురద గొర్రు తోలాల్సిన అవసరం లేదు. ఎందుకంటే రోడా రీడర్ వెనుక బ్లేడు బురదను చదును చేస్తుంది.
- లేకుంటే పవర్ టిల్లర్ ద్వారా దమ్ము చేసినా ఆశాజనకమైన ఫలితం రావచ్చు.

పంట దమ్ము పూర్తయ్యాక..

- పొలంలో పంట దమ్ము పూర్తయ్యిన తర్వాత బరువు నేలల్లో 24 గంటలు, తేలిక నేలల్లో 12 గంటల పాటు స్థిరపడనివ్వాలి.
- అనంతరం పొలంలో వరినాటు యంత్రంతో నాటేందుకు వీలుగా కొద్దిపాటి నీరు ఉంచాలి.
- ఇలా చేయడం వల్ల యంత్రం పొలంలో సులువుగా తిరగడంతో పాటు, యంత్రానికి కింద బురద అంటుకోదు.



వరినాటు యంత్రం

ఉపయోగాలు

- విత్తన వినియోగం తక్కువ
- కూలీల ఖర్చు ఆదా
- తెగుళ్ల ఉధృతి చాలా తక్కువ
- తక్కువ సమయంలో నాట్లు
- నారుమడి యాజమాన్యంతో సమయం ఆదా

- మొక్కల మధ్య కు మొక్కకు ఎడం 16 సెం.మీ ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఈవిధానంలో ఎకరాకు సుమారు 80 ట్రేలు అవసరమవుతాయి.

రైతులకు ప్రయోజనం



వరినాటు యంత్రాల వల్ల రైతులకు అనేక ప్రయోజనాలు సమకూరుతాయి. రైతులందరూ అధునాతన వరి సాగుపై దృష్టి సారించాలి. దీనివల్ల పెట్టుబడి ఆదాతో పాటు, సమయం కలిసి వస్తుంది. యంత్రాల వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– కె.నాగేశ్వరరావు, ఇన్‌చార్జి డీఏఓ, అమలాపురం

మహిళ అదృశ్యం కేసు ఛేదించిన పోలీసులు



మహిళను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్సై విజయబాబు

తుని: రెండేళ్ల క్రితం అదృశ్యమైన మహిళను పట్టణ పట్టుకుని ఆమె తల్లిదండ్రులకు గురువారం అప్పగించారు. పట్టణ సీఐ గీతారామకృష్ణ కథనం ప్రకారం..2022 నవంబర్‌లో పట్టణానికి చెందిన పోతబత్తుల భాగ్యలక్ష్మి భర్త, పిల్లలను వదిలేసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఇటీవల బాధ్యతలు చేపట్టిన జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు వుమెన్ కేసుల దర్యాప్తునకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందం ఈ కేసును ఛేదించింది. భాగ్యలక్ష్మి భర్త పోతబత్తుల బాబు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. పోతబత్తుల భాగ్యలక్ష్మి భర్త, తల్లిదండ్రులకు చెప్పకుండా తన ముగ్గురు పిల్లలను వదిలేసి పని నిమిత్తం మలేసియా వెళ్లిపోయింది. రెండు సంవత్సరాల తరువాత మలేసియా నుంచి తిరిగి ఇండియాకు వచ్చి ఎవరి దగ్గరకు వెళ్లకుండా కైకలూరులో నివాసం ఉంటోంది. టీం సభ్యులు ఎస్సై విజయబాబు, సిబ్బంది శ్రీను, కిరణ్, నాయుడు సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా భాగ్యలక్ష్మి కైకలూరులో ఉన్నట్లు గుర్తించారు. భాగ్యలక్ష్మిని ఆమె ఇష్టప్రకారం తీసుకొచ్చి భర్త, తల్లిదండ్రులకు అప్పగించారు. మహిళ మిస్సింగ్ కేసును ఛేదించడంలో శ్రద్ధ చూపిన సీఐ గీతారామకృష్ణ, ఎస్సై విజయబాబు, సిబ్బందిని ఎస్పీ బిందుమాధవ్, డీఎస్పీ శ్రీహరిరాజు అభినందించారు.

మీనన్ ఫొటోగ్రఫీకి గోల్డ్ మెడల్



నల్లి మీనన్ ప్రదర్శించిన కళాకారుల భరతనాట్య భంగిమ ఫొటో

సఖినేటిపల్లి: మండల పరిధిలోని కేశనపల్లిలో ఇటీవల నిర్వహించిన ఫొటోగ్రఫీ వర్క్‌షాపులో సఖినేటిపల్లి మండలం అంతర్వేదిపాలెంకు చెందిన ఫొటోగ్రాఫర్ నల్లి మీనన్‌కు గోల్డ్‌మెడల్ దక్కింది. ప్రొఫెషనల్ ఫొటో, వీడియోగ్రాఫర్, సఖినేటిపల్లి అసోసియేషన్ ఆధ్వర్యంలో పై ఫొటోగ్రఫీ వర్క్‌షాపు నిర్వహించారు. మీనన్ ప్రదర్శించిన కళాకారుల భరతనాట్యం భంగిమ ఫొటోకు గోల్డ్‌మెడల్ దక్కింది. ఈ సందర్భంగా మీనన్‌ను గురువారం అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

రిజిస్ట్రేషన్ శాఖలో సర్వర్ డౌన్

ఇక్కట్లకు గురైన క్రయ విక్రయదారులు



కాకినాడ సబ్ రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయంలో సర్వర్ పని చేయక వేచిచూస్తున్న క్రయ విక్రయదారులు

కాకినాడ లీగల్: ఫిబ్రవరి 1వ తేదీ నుంచి భూమి విలువలు పెరుగుతున్నట్టు ప్రభుత్వం ప్రకటించడంతో ముందుగా రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు క్రయ విక్రయదారులు రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు బారులు తీరారు. అయితే బుధవారం సర్వర్ డౌన్ కావడంతో రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి. దీంతో ఉదయం వచ్చిన క్రయవిక్రయదారులు రాత్రి వరకు రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద పడిగాపులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. భూముల మార్కెట్ విలువలను ఫిబ్రవరి 1వ తేదీ నుంచి పెంచుతున్నట్టు ఈ నెల 27వ తేదీన ప్రభుత్వం ప్రకటించింది. అయితే సుమారు నెల రోజుల ముందుగానే ధరలు పెరుగుతాయని తెలియజేస్తే క్రయవిక్రయదారులు ముందుగానే రిజిస్ట్రేషన్లు చేసుకునేవారమని, నాలుగు రోజులు ముందుగా తెలియజేయడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడిందంటూ గగ్గోలు పెట్టారు. దీనికి తోడు సర్వర్‌లు పనిచేయకపోవడంతో గంటల తరబడి కార్యాలయం వద్ద వేచి ఉండాల్సి వస్తోందన్నారు. కొన్ని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద కనీస సౌకర్యాలు లేక నిలబడలేక ఇబ్బందులు పడ్డారు. మరికొన్ని కార్యాలయాల్లో కనీసం తాగడానికి మంచినీళ్లు కూడా ఏర్పాటు చేయకపోవడంతో దాహంతో క్రయవిక్రయదారులు అల్లాడారు. ప్రభుత్వం వచ్చిన వెంటనే కార్యాలయాల్లో కనీస సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారని, అయితే కనీసం మంచినీటి సౌకర్యం కూడా లేదని క్రయవిక్రయదారులు వాపోయారు.

ఒత్తిడితో రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ శివరామ్ మృతి!



బాదావతుల శివరామ్ (ఫైల్)

కాకినాడ లీగల్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీగా విధులు నిర్వహిస్తున్న బాదావతుల శివరామ్ ఉద్యోగ నిర్వహణలో ఒత్తిడికి గురై మృతిచెందినట్టు ఉద్యోగులు చెబుతున్నారు. 1995లో సబ్ రిజిస్ట్రార్‌గా శివరామ్ విధుల్లో జాయిన్ అయ్యి వివిధ హోదాల్లో పనిచేసి ప్రస్తుతం కాకినాడ డీఐజీగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. విధి నిర్వహణలో భాగంగా కాకినాడ నరసన్ననగర్‌లో ఒక అపార్ట్‌మెంట్‌లో ఒంటరిగా ఉంటున్నారు. మంగళవారం రాత్రి ఉద్యోగి టిఫిన్ పట్టుకుని వెళ్లి ఇచ్చివచ్చారు. బుధవారం ఉదయం 10 గంటల సమయంలో ఆయన ఉంటున్న ఫ్లాట్‌కు ఉద్యోగి, కార్ డ్రైవర్ వెళ్లి డోర్ కొట్టగా తీయకపోవడంతో డోర్‌ను బ్రేక్ చేసి తెరిచారు. ఆయన వంటగదిలో పడిపోయి ఉండడంతో స్థానిక టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి పరిశీలించి మృతిచెందినట్టు గుర్తించారు.

పని ఒత్తిడితోనే...

భూమి విలువలు జనవరి 1 నుంచి పెంచాలని, ప్రతిపాదనలు తయారు చేయాలని రిజిస్ట్రేషన్ ఉద్యోగులకు ఉత్తర్వులు వచ్చాయి. దానితో ఉమ్మడి జిల్లా డిఐజీగా బాధ్యతలు నిర్వహిస్తున్న శివరామ్‌పై అదనంగా పడింది. ఈ మార్కెట్ విలువల కోసం గత ఏడాది నవంబర్ నెల నుంచి ప్రక్రియ ప్రారంభమైంది. అప్పటి నుంచి పని ఒత్తిడికి లోనయ్యారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి మార్కెట్ విలువ పెంచనున్నట్టు అధికారికంగా వార్తలు రావడంతో డీఐజీపై ఒత్తిడి పెరిగింది. దీంతోనే ఆయన ఒత్తిడికి లోనై మృతి చెంది ఉంటారని ఉద్యోగులు భావిస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి...

కాకినాడ క్రైం: కాకినాడలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. డైరీఫారంలోని ఏఎంజీ స్కూల్ ఎదురు రోడ్డుపై ఓ గుర్తు తెలియని వ్యక్తి అచేతనంగా పడి ఉన్నాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకొని పరిశీలించగా వ్యక్తి అప్పటికే మృతి చెంది ఉన్నాడు. తల, గుండెపై గాయాలు ఉండడంతో అనుమానాస్పద మృతిగా పోలీసులు గుర్తించి గురువారం రాత్రి కేసు నమోదు చేశారు.

పురుగు మందు తాగి ఒకరు..

కాకినాడ క్రైం: రాజమహేంద్రవరం బర్మాకాలనీకి చెందిన టి.బుల్లిబాబు(48) పురుగు మందు తాగి ఈ నెల 28వ తేదీన రాజమహేంద్రవరంలోని ఆసుపత్రి నుంచి కాకినాడ జీజీహెచ్‌లో చేరాడు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు.

యువతి ఆచూకీని కనుగొన్న పోలీసులు

జగ్గంపేట: అదృశ్యమైన యువతి ఆచూకీని జగ్గంపేట పోలీసులు కనుగొన్నారు. జగ్గంపేటకు చెందిన 17 ఏళ్ల యువతి ఈ నెల 29 తేదీ నుంచి కనిపించడం లేదు. తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై రఘునాథరావు గురువారం యువతి ఆచూకీ కనుగొని ఆమె పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించినట్లు సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు.

కుమారుడి మృతికి కారకులైన వారిపై చర్యలకు వినతి

ఎస్పీకి ఫిర్యాదు చేసిన మహిళ



మృతుడు రాంబాబు (ఫైల్)

సఖినేటిపల్లి: మండల పరిధిలోని గొంది గ్రామానికి చెందిన చెల్లుబోయిన దుర్గా భవానీ, తన మొదటి భర్త గుబ్బల నరసింహమూర్తి ద్వారా పుట్టిన గుబ్బల రాంబాబు(18)మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని ఎస్పీకి ఫిర్యాదు చేసింది. వివరాలు గురువారం మీడియాకు తెలిపింది. ఉయ్యూరువారి మెరక గ్రామానికి చెందిన గుబ్బల నరసింహమూర్తిని ఆమె మొదటి వివాహం చేసుకుంది. వారికి రాంబాబు పుట్టాడు. అయితే అప్పట్లో భర్త, అత్త పెట్టే ఇబ్బందులు తట్టుకోలేక ఆమె విడాకులు తీసుకుంది. దుర్గాభవానీ రెండో వివాహం చేసుకున్నా.. కుమారుడు రాంబాబు ఆమె వద్దకు వెళ్తూ, వస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో ఆమె తరువాత నరసింహమూర్తి ద్వితీయ వివాహం చేసుకున్నాడు. నిండు గర్భిణిగా ఉండగా రెండో భార్య మృతి చెందడంతో దుర్గను మూడో వివాహం చేసుకున్నాడు. ఉయ్యూరువారి మెరకలో సొంత తండ్రి, నానమ్మ వెంకాయమ్మ, సవతి తల్లి దుర్గల వద్ద రాంబాబు ఉంటున్నాడు. నీకు ఆస్తిలో వాటా ఇవ్వాలా అంటూ సూటి పోటి మాటలతో వేధించి, ముగ్గురూ కలసి తన కుమారుడిని ఈ నెల 27వ తేదీన కొట్టి చంపేశారని ఆ ఫిర్యాదులో దుర్గాభవాని పేర్కొంది. పైగా మృతదేహాన్ని సోంపల్లి శ్మశానవాటికలో ఎవరికీ తెలియకుండా దహన పరిచారని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు తండ్రి నరసింహమూర్తి, నానమ్మ వెంకాయమ్మ, సవతి తల్లి దుర్గలపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని దుర్గాభవానీ అభ్యర్థించింది. ఈ ఫిర్యాదుపై రాజోలు సీఐ విచారణాధికారిగా దర్యాప్తు చేపట్టనున్నారు.

ప్రియుడి దారుణ హత్య

సహజీవనం చేస్తున్న ప్రియురాలి ఘాతుకం



చంద్రశేఖర్‌స్వామి మృతదేహం

కాకినాడ క్రైం: ఓ వ్యక్తితో సహజీవనం చేస్తున్న ప్రియురాలి తప్పటడుగు ప్రియుడు హత్యకు దారి తీసింది. ఈ ఘటన కాకినాడలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు, రావులపాలేనికి చెందిన మునిస్వామి లావణ్యకు కొన్నేళ్ల క్రితం చిత్తూరుకు చెందిన బాలుతో వివాహమైంది. మనస్పర్థల కారణంగా ఇద్దరూ విడిపోగా నాలుగేళ్ల క్రితం రావులపాలెంలోనే గుడాల చంద్రశేఖర్‌స్వామి(30) అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం సహజీవనానికి దారి తీసింది. వీరి బంధం ఇలా కొనసాగుతుండగా, రెండు నెలల క్రితం లావణ్యకు కాకినాడకు చెందిన ఆర్‌టీసీ డ్రైవర్ లోవరాజుతో పరిచయం ఏర్పడింది. అతడి పరిచయంతో లావణ్య తన మొదటి ప్రియుడు చంద్రశేఖర్‌ను వదిలేసి కాకినాడకు లోవరాజుతో కలిసి వచ్చేసింది. రెండు నెలల క్రితం లోవరాజు తన ప్రియురాలిని కాకినాడ డైరీఫారం సమీపంలో ఉన్న టిడ్కో ఇళ్లలో ఓ ఇల్లు అద్దెకు తీసుకొని ఉంచాడు. ఇదిలా ఉంటే చంద్రశేఖర్ తన ప్రియురాలు లావణ్య జాడ తెలుసుకొని బుధవారం రాత్రి ఇంటికి వచ్చాడు. అర్ధరాత్రి ఇంట్లో ఇద్దరి మధ్య వాగ్వాదం జరగగా లావణ్య చంద్రశేఖర్‌ను ఇంట్లో ఉన్న పప్పుగుద్దు, ఇనుప సన్నిరాయితో తలపై మోదింది. ఈ ఘటనలో చంద్రశేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. గురువారం ఉదయం సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని విచారణ చేపట్టారు. నిందితురాలు లావణ్య పరారీలో ఉండగా హత్యలో లోవరాజు పాత్రపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాకినాడ పోర్ట్ పోలీస్‌స్టేషన్‌లో హత్యా ఘటనపై కేసు నమోదైంది.

చిట్టీల పేరుతో మోసం చేసిన ముగ్గురి అరెస్టు

జగ్గంపేట: చిట్టీల పేరుతో 80 మంది నుంచి రూ.లక్షలు వసూలు చేసి తప్పించు తిరుగుతున్న ఒక మహిళతో పాటు ఇద్దరు వ్యక్తులను జగ్గంపేట ఎస్సై రఘునందనరావు అరెస్టు చేసినట్లు సీఐ వైఆర్‌కె శ్రీనివాసరావు తెలిపారు. ఆయన అందించిన వివరాల ప్రకారం జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామానికి చెందిన పి.దేవి, పి.ఆంజనేయులు, పి.అప్పారావు గత కొంతకాలంగా ఇర్రిపాక గ్రామంలో ప్రజల నుంచి వసూలు చేసిన చీటీల సొమ్ము తిరిగి చెల్లించకుండా తప్పించుకుని తిరుగుతున్నారు. వీరిని గురువారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా 14 రోజులు న్యాయస్థానం రిమాండ్ విధించిందని తెలిపారు.

అంచనాలు తారుమారు

వీసీల నియామకాల్లో తెరపైకి వయసు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): విశ్వవిద్యాలయాలకు ఉప కులపతుల నియామకాల్లో అంచనాలు తారుమారవుతున్నాయి. కూటమి ప్రభుత్వం సాంకేతిక విద్యాలయాల్లో ఆచార్యులను వీసీలుగా నియమించాలని భావిస్తోంది. ఐఐటీ, ఎన్ఐటీ సాంకేతిక విద్యాలయాల్లో ఆచార్యులుగా పనిచేస్తున్న వారిని రెగ్యులర్ వీసీలుగా నియమిస్తే నైపుణ్యాభివృద్ధి కోర్సుల నిర్వహణకు తోడ్పడుతుందని భావిస్తున్నారు. దీంతోపాటు స్థానికంగా ఉన్న ఆచార్యులను కాకుండా ఇతర విశ్వవిద్యాలయాల ఆచార్యులను వీసీలుగా నియమించాలనే మరో ఆలోచన ఉంది. 62 సంవత్సరాల లోపు ఉన్నవారికే అవకాశాలు కల్పించడానికి చర్యలు చేపడుతున్నట్టు విశ్వసనీయ సమాచారం. దానిలో భాగంగా రాష్ట్రంలో సాంకేతిక వర్సిటీలో కీలకంగా ఉన్న జేఎన్‌టీయూ కాకినాడకు దాదాపు 20 మందికి వరకూ వీసీ పోస్టుకు దరఖాస్తు చేశారు. దరఖాస్తు చేసిన వారిలో కాకినాడ వర్సిటీకి అధికంగా ఆప్షన్లు ఇచ్చారు. ఇప్పటికే అభ్యర్థుల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ సెర్చ్ కమిటీ పూర్తి చేసింది. జేఎన్‌టీయూ కాకినాడకు దరఖాస్తు చేసిన వారిలో పదవీ విరమణ చేసినవారు, గతంలో వీసీలుగా పనిచేసిన వారు ఉన్నారు. 62 సంవత్సరాల వయసు లోపుగలవారిని వీసీలుగా నియమిస్తుండటంతో ఆశావహుల్లో నిరుత్సాహం ఏర్పడింది. జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీకి తెలంగాణా నుంచి జాతీయ విద్యాసంస్థకు చెందిన ప్రొఫెసర్ నియామకం దాదాపు ఖరారైనట్లు చర్చ నడుస్తోంది. ప్రస్తుతం ఇన్‌చార్జి వీసీగా ఉన్న ప్రొఫెసర్‌ను ఏదో ఒక విశ్వవిద్యాలయానికి నియమించే అవకాశం ఉంది. రాష్ట్రంలో ఉన్న 17 వర్సిటీలకు ఇన్‌చార్జ్ వీసీలు పనిచేస్తున్నారు. గత జూలై 18 నుంచి ఇన్‌చార్జిల పాలనలో వర్సిటీలు కొనసాగుతుండడంతో రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్స్ ఇన్‌చార్జిలుగా కొనసాగుతున్నారు. వర్సిటీలకు పూర్తి స్థాయి వీసీలు లేకపోవడంతో ఈఏపీసెట్, ఈసెట్ వంటి ఉమ్మడి పరీక్షలు నిర్వహణకు కన్వీనర్ల నియామకంలో జాప్యం జరుగుతోంది.

ఇంటర్ విద్యార్థిపై కిడ్నాప్ కేసు

మామిడికుదురు: ప్రేమ పేరుతో పదో తరగతి చదువుతున్న బాలికను కిడ్నాప్ చేసి ఆమెపై లైంగిక దాడికి పాల్పడిన ఇంటర్ విద్యార్థిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. దీనికి సంబంధించి నగరం ఎస్సై ఎ.చైతన్య కుమార్ గురువారం తెలిపిన వివరాలు ఇవి. పెదపట్నంలంకకు చెందిన పదో తరగతి చదువుతున్న 14 ఏళ్ల బాలిక ఈ నెల 19వ తేదీన అదృశ్యమైంది. దీనిపై బాలిక తల్లి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. తన కుమార్తె అదృశ్యం కావడానికి గోగన్నమఠం గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి కారణమని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపిన పోలీసులు అతనిని అదుపులోకి తీసుకున్నారు. అమ్మమ్మ స్వగ్రామమైన పెదపట్నంలంకలో అతను పదో తరగతి వరకు చదువుకున్నాడు. అక్కడ మైనర్ బాలికతో పరిచయం పెంచుకున్నాడు. దాన్ని ఆసరాగా చేసుకుని బాలికను తీసుకుపోయాడు. ప్రస్తుతం అతను హైదరాబాదులో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. బాలిక అదృశ్యంపై మొదట్లో నమోదు చేసిన మిస్సింగ్ కేసును మైనర్ బాలిక కిడ్నాప్, ఆమెపై లైంగిక దాడి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుగా మార్పు చేశామని ఎస్సై తెలిపారు.